రుద్రకోటేశ్వరుడి దర్శనం.. భక్తులకు భారం

శివుడే పేదవాడు. అతని భక్తులు అంతకంటే పేదలే. అలాంటి వారిపై అటవీశాఖ భారం మోపుతోంది. ఒక్కో వాహనానికి రూ.300 రుసుం భక్తుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తోంది. ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడే ఎందుకు రుసుం వసూలు చేస్తున్నారో అర్థం కాక భక్తులు.. 'ఈశ్వరా.. అటవీ శాఖ తీరు చూడరా.. అంటూ మొరపెట్టుకుంటున్నారు. – ఆత్మకూరు

- ఒక్కో వాహనానికి రూ.300 వసూలు
- అటవీ అధికారులపై భక్తుల మండిపాటు



రుద్రకోడూరు క్షేత్రంలో వెలిసిన రుద్రకోటేశ్వరస్వామి



నల్లమలలో వెలసిన రుద్రకోటేశ్వరస్వామి ఆలయం

నల్లమల అటవీ పరిధిలో జ్యోతిర్లింగ రూపంలో స్వయంభూగా వెలిసిన రుద్రకోటేశ్వర క్షేత్రానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. మహాశివుడు పార్వతి సమేతంగా భూలోకంలో విహరించే సమయంలో నల్లమల అటవీ పరిధిలోని ఈ క్షేత్రం వద్ద స్వయంభూ లింగాకరుడిగా వెలిసినట్లు చరిత్ర చెబుతోంది. ఈ క్షేత్రం సమీపంలోని కల్ప వృక్షం, నాగులగుట్ట, సీతారాముల ఆలయంతోపాటు పక్కనే అత్యంత పవిత్రమైన జలాలతో కూడిన కోనేరులు వెలిశాయి. మహాశివరాత్రి, కార్తీకమాసం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఈ క్షేత్రాన్ని సందర్శిస్తూ ఉంటారు. ఇక్కడ వెలసిన రుద్రకోటేశ్వర, రుద్రాణిమాతలను దర్శించుకునేందుకు ఆత్మకూరు డివిజన్ నుంచే గాక నంద్యాల, అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

ఇదెక్కడి ధర్మం

హిందువుల ఆలయాలకు వెళ్తే రుసుం వసూలు చేయడం ఇదెక్కడి ధర్మం. గతంలో ఎన్నోసార్లు రుద్రకోటేశ్వరస్వామి ఆలయానికి వెళ్తే అటవీశాఖ అధికారులే రక్షణగా ఉండేవారు. కానీ ఏ అధికారులు వీరికి రుసుం వసూలుకు ఆదేశించారో గానీ అన్యాయంగా రూ.300 వసూలు చేస్తున్నారు. శ్రీశైలానికి వెళ్లినా టోల్ గేట్ వద్ద వాహనాలకు రూ.100 మాత్రమే వసూలు చేస్తున్నారు. ఇక్కడ రూ.300 వసూలు చేయడం దారుణం. ఇప్పటికైనా భక్తులను ఉచితంగా క్షేత్రానికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. – వెంకటేశ్వర్లు, భక్తుడు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వసూలు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లే భక్తుల వాహనాలకు రుసుం వసూలు చేస్తున్నాం. ప్రతి వాహనానికి రూ.300 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించాం. వసూలు చేసిన మొత్తాన్ని పర్యావరణ పరిరక్షణ కోసం ఉపయోగిస్తాం. రసీదు సైతం వారికి అందజేస్తున్నాం. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ప్రతిఒక్కరినీ పంపుతాం. వాహనాలకు మాత్రమే రుసుం వసూలు చేస్తున్నాం.

– కృష్ణప్రసాద్, బైర్లూటీ రేంజ్ ఆఫీసర్



టోకెన్ చూపుతున్న శివస్వాములు

ఫారెస్ట్ యాక్ట్ పేరుతో వసూలు..

రుద్రకోటేశ్వరస్వామి క్షేత్రానికి భక్తులు ఎన్నో ఏళ్లగా నడుచుకుంటూ వెళ్లేవారు. కాలక్రమేణా నల్లమల అడవిలో గుర్రపు బండ్లు, ఎద్దులబండ్లు, ట్రాక్టర్లు, బైకులు, ఆర్టీసీ బస్సులు, కార్లు కూడా భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా ఏళ్లగా రాకపోకలు సాగించే భక్తులకు ఎప్పుడూ ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. కానీ మూడు నెలలు క్రితం కార్తీక మాసం నుంచి ఫారెస్ట్ యాక్ట్ పేరుతో వాహనాలపై రుసుం వసూలుకు అటవీ శాఖ అధికారులు తెర తీశారు. నల్లకాల్వ సమీపంలోని ఫారెస్ట్ చెక్‌పోస్టు ఏర్పాటు చేసి సిబ్బందితో వసూళ్లకు నడుంబిగించారు. గతంలో క్షేత్రానికి వెళ్లే సమయంలో అటవీశాఖ అధికారులు భక్తులకు రక్షణగా నల్లమల దాటి నల్లకాల్వ చేరే వరకు పర్యవేక్షించేవారని, అయినా ఎలాంటి రుసుం వసూలు చేసేవారు కాదని, ఇప్పుడు ఇలా వసూలు చేయడం దారుణమని మండిపడుతున్నారు. త్వరలో మహా శివరాత్రి ఉత్సవాల నిమిత్తం భక్తులు భారీగా తరలి రానున్నారు. ప్రభుత్వం స్పందించి వాహనాలకు రుసుం వసూలు చేయొద్దని అటవీ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు.

పల్లకీలో విహరించిన ఆదిదంపతులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్లను అలంకరించి శాస్త్రోక్త పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం కనుల పండుగగా సాగింది. భక్తులు శివనామస్మరణ చేస్తూ పల్లకీ వెంట నడిచారు.



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

నాటుసారా స్వాధీనం

నందికొట్కూరు: పట్టణంలోని ఎరుకలిపేటలో ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం ఆకస్మికంగా దాడులు చేశారు. నాటుసారా అమ్ముతున్న పాలకొండ లక్ష్మీదేవిని అరెస్టు చేసి 10 లీటర్ల సారాయి స్వాధీనం చేసుకున్నారు. ఆమెను కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ ఆదేశించినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఎస్‌ఐ జబ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, పద్మనాభం, పోలీసులు శివన్న తదితరులు ఉన్నారు.

గిరిజనులకు నిత్యావసర సరుకుల పంపిణీ

కొత్తపల్లి: మండలంలోని గిరిజన గూడెలలోని గిరిజనులకు నిత్యావసర సరుకులను ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఆర్డీటీ టీమ్‌లీడర్ వేమయ్య అధ్యక్షత సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ ఉమారాణి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఎంతోగానో తోడ్పాటు నిస్తుందన్నారు. అందులో భాగంగా మండలంలోని జానాలగూడెం, బలపాల తిప్ప, సిద్దేశ్వరం, ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, కొత్తపల్లి, పాలెంచెరువు గూడెలలోని గిరిజన వికలాంగులు 48 మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. ఆర్డీటీ సంస్థ సీఓలు సుంకప్ప, పాల్‌లు పాల్గొన్నారు.



జనాలాగూడెంలో గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అవసరం మేరకే యూరియా వాడండి



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: రబీలో వరి సాగు చేస్తున్న రైతులు అవసరం మేరకే యూరియా వాడాలని అధిక ఎరువులు వాడి నష్టపోకూడదని ఏఓ పవన్‌కుమార్ సూచించారు. స్థానిక రైతు సేవ కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ వారి ×పాడి పంటలు౯ మాస పత్రికలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉంటుందన్నారు. కాలానుసారంగా చేపట్టే పొలం పనులు, చీడపీడల నివారణ యాజమాన్యాలు మరి ఇతర వ్యవసాయ సంక్షిప్త సమాచారం ఉంటుందని, కావున రైతులు పాడిపంటలు మ్యాగజిన్ ఏడాదికి 300 రూపాయలు చెల్లించి పొందాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణ సిబ్బంది నాగమణి, రైతులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

నందికొట్కూరు: సమాచార హక్కు చట్టంపై అందరికీ అవగాహన అవసరమని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. సోమవారం పట్టణంలోని వాల్మీకి నగర్‌లో ఉన్న సచివాలయం-3లో సమాచార హక్కు చట్టంపై రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2005 సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రజలు అడిగిన ప్రతి సమాచారం నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని చెప్పారు. సమాచార హక్కు చట్టం పట్ల ఎవరు నిర్లక్ష్యం చేసిన వారే బాధ్యులు అవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఆర్వో మధుబాబు, టీపీఓ రంగస్వామి, డీఈ నాసీర్, తదితరులు పాల్గొన్నారు.



సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ బేబి



అలరించిన సంప్రదాయ నృత్యప్రదర్శన

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో సోమవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన నవలాస్య కళానిలయం వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో మహాగణపతిం, మూషికవాహన, శివాష్టకం, నమశ్శివాయతే, శివతాండవం, , భో శంభో, అయిగిరినందిని తదితర అష్టకాలకు, గీతాలకు ఆద్య, దక్షిత, జాగృతి, దివ్య, దక్షిత తదితరులు నృత్యప్రదర్శన చేశారు. – శ్రీశైలంటెంపుల్

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నందికొట్కూరు: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ 11వ జాతీయ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల నెల 24 నుంచి 26వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే 11వ ఏఐసీసీటీయూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామకృష్ణ, భాస్కర్‌గౌడ్, షేక్షావలి, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో నేడు రథసప్తమి వేడుకలు

మహానంది: మహానందిలో మంగళవారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ రథసప్తమిని పురస్కరించుకుని మహానందిలోని మహారథం వద్ద సూర్యుడికి ప్రీతికరమైన సూర్యనమస్కారాలు, అర్ఘ్యప్రదానాలు చేపట్టి రథాంగ దేవతలకు ప్రత్యేకంగా తయారు చేసిన నివేదన సమర్పణ ఉంటుందన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రథంలోని దేవతలను శాస్త్రోక్త పూజలతో ఆవాహన చేసి, రథాన్ని బయటికి తీస్తామని చెప్పారు.

27 నుంచి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 27 నుంచి మహానందిలో మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన నిర్వహిస్తున్నట్లు మహానంది మండల రైతు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మహానందిలో రైతు సంబరాలు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 27న సీనియర్స్, 28న సబ్ జూనియర్స్, 29న న్యూ కేటగిరీ విభాగాల పోటీలు ఉంటాయన్నారు. సీనియర్స్ విభాగంలో విజేతలకు వరుసగా రూ. 1.25లక్షలు, రూ.80వేలు, రూ.60వేలు,రూ.40వేలు, రూ.30 వేలు బహుమతిగా అందజేస్తామన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో వరుసగా రూ. 75వేలు, రూ. 60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, న్యూ కేటగిరీ పోటీల్లో వరుసగా రూ. 60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు అందిస్తామని చెప్పారు.

వ్యాపారాలకు అనుమతి ఇప్పించండి

ఆత్మకూరు: శివరాత్రి, ఉగాది సందర్భంగా పాదయాత్రగా వెళ్లే భక్తులకు నల్లమల అటవీ ప్రాంతంలో కర్రలు, పండ్లు, తినుబండారాలు తదితరాలు విక్రయించుకునేందుకు అనుమతులు ఇప్పించాలని బైర్లూటీ, నాగలూటి చెంచుగూడానికి చెందిన గిరిజనులు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని కోరారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలో ఎమ్మెల్యేను కలిసి తాము వ్యాపారం చేసుకునేందుకు అటవీశాఖ అధికారులతో చర్చించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: పట్టణ శివారు ఆత్మకూరు-నంద్యాల రహదారిలోని ఉర్దూ స్కూల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హరీష్(40) అనే వ్యక్తి మృతిచెందినట్లు సీఐ రాము సోమవారం తెలిపారు. మృతుడిది పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. వెలుగోడు మండలం మాధవరంలో ఉన్న భార్య పుట్టింటిలో ఉండగా ఆమె వద్దకు ప్రాతకోట నుంచి పల్సర్ బైకుపై వెళ్తూ అదుపు తప్పి కింద పడిపోయాడు. మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పాములపాడుకు 59 యూనిట్లు మంజూరు

పాములపాడు: మండలంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం 59 యూనిట్లు మంజూరు చేసిందని ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు బీసీలకు 55, ఈబీసీలకు 2, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు 1, బ్రాహ్మణ్ కార్పొరేషన్‌కు 1 చొప్పున సంబంధించిన బ్యాంకులకు కేటాయించడం జరిగిందన్నారు. 21 నుంచి 60 సంవత్సరాల్లోపు వారు ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఈ నెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

ప్రశాంత జీవనం సాగించాలి



పల్లెనిద్ర కార్యక్రమంలో గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ కేశవ

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించాలని ఎస్‌ఐ.ఎం.కేశవ సూచించారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని ఎం.లింగాపురం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లు, గొడవలు, ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని సూచించారు. ప్రజలు అన్నదమ్ములవలే కలిసిమెలిసి ఉండాలని చెప్పారు.

హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే జరిమానా

నందికొట్కూరు: ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానా విధిస్తామని టౌన్ ఎస్‌ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం పట్టణ శివారులో ద్విచక్ర వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

పాములపాడు :ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమవుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని వేంపెంట యూనిట్ వారి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎన్ఎఫ్ఏ నాగరాజు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ఇంకా ఎక్కువ ఉత్పత్తులో పెద్ద ఎత్తున స్టాల్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఎంఈఓ -2 సుభాషిని దేవి, లైబ్రేరియన్ క్రిష్టారెడ్డిలు కూరగాయలు, ఆకుకూరలు పరిశీలించి కొనుగోలు చేశారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఏఓ కె.మహేష్ అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలను సోమవారం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏపీఎం పుల్లయ్య, ప్రకృతి వ్యవసాయం మండల ఏటీఎం యూనిట్ ఇన్‌చార్జ్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ప్రదర్శిస్తున్న కూరగాయలు

వెలుగోడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రకతి వ్యవసాయ కూరగాయల ప్రదర్శనను ఏఓ పవన్ కుమార్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు ఈఓఆర్డీ మురారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోమల తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజలు ఉద్యమించాలి

ఆత్మకూరు: పట్టణంలోని 24 వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజలు ఉద్యమానికి సిద్ధం కావాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సుదర్శన వర్మ భవన్‌లో సీపీఎం పట్టణ కమిటీ సమావేశం పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్ అధ్యక్షతన జరిగింది. రణధీర్ మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాలిటీ గ్రేడ్-3 మున్సిపాలిటీ అయిన తర్వాత పొయ్యిలో నుంచి పెన్నంలోకి పడినట్లుగా ప్రజల పరిస్థితి అయ్యిందన్నారు. పట్టణంలో ఏ వీధిలోకి వెళ్లినా రోడ్లు చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయన్నారు. పట్టణంలో అనేక వీధుల్లో సిమెంట్ రోడ్లు, 24 వార్డుల్లో డ్రైనేజీ సిస్టం లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. పట్టణంలో కుక్కలు ప్రజలపైన చిన్నారులపైన, వృద్ధులైన వీరవిహారం చేస్తున్నా మున్సిపాలిటీ అధికారులు ఏమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో సీపీఎం పట్టణ నాయకులు ఎ.సురేంద్ర, షేక్‌ఇస్మాయిల్, వీరన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్

సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురండి

కొత్తపల్లి: సమస్యలు ఉంటే ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం వీఆర్వోలతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ సర్వేలను, భూ రిసర్వేలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

కాకనూరు పీఠంలో వసంత పంచమి

బండి ఆత్మకూరు : మండల పరిధిలోని కాకనూరు గ్రామంలో సోమవారం వసంత పంచమి సందర్భంగా శ్రీ శారదా పీఠంలో పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివయోగేంద్ర స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవికి ప్రత్యేక అభిషేకాలు, సహస్రనామ పారాయణం, అర్చనలు చేశారు. వసంత పంచమి మహత్యాన్ని వివరించారు. 65 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న పీఠాధిపతి



అన్నప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద పథకానికి సోమవారం వికారాబాద్‌కు చెందిన భక్తుడు సి.చైతన్య రూ.1,00,116 విరాళం అందించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నందికొట్కూరు: పేదలకు కూటమి ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, నాయకులు రఘురామ్మూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పేదలకు కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసే వరకు పోరాడుతామన్నారు. ఎన్నికల ముందు పట్టణాలకు చెందిన పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని చంద్రబాబు హామీచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఈ విషయంపై చర్చ జరపలేదని మండిపడ్డారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రజితమ్మ, అబ్దుల్ మజీద్, ప్రసాద్, మహానంది, వినోద్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, పేదలు

క్లుప్తంగా

ధర్మమార్గంలో నడవాలి



వనుములపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

పగిడ్యాల: సకల శరీరులు కోరికలను వదిలి ధర్మమార్గంలో నడుచుకుని ముక్తిని పొందాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లి కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ప్రబోధించారు. రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని సోమవారం మండలంలోని పాత ముచ్చుమర్రి, పడమర వనుములపాడు గ్రామాల్లో కమిటీ సభ్యులు పర్యటించి త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పుల్లారెడ్డి, కుమారాచారి, నాగమద్దిలేటి, సంజీవ, పార్థసారధి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

వెలిగిన విద్యుత్ దీపాలు



కేజీ రోడ్డు నుంచి తాటిపాడు వరకు ఉన్న రోడ్డు వెంట వెలిగిన విద్యుత్ దీపాలు

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: జనవరి నెల 17న 'సాక్షి' దినపత్రికలో 'అంధకారంలో తాటిపాడు రోడ్డు' శీర్షికన ప్రచురితమైన కథనానికి తాటిపాడు గ్రామసర్పంచ్ వంగల లక్ష్మీదేవి స్పందించారు. జూపాడుబంగ్లా కేజీ రోడ్డు నుంచి తాటిపాడు వరకు కిలోమీటరు మేర ఉన్న రహదారి వెంట వీధీదీపాలు వెలిగేలా చేశారు.

తాటిపాడులో నీటిసరఫరా పునరుద్ధరణ

'తాటిపాడులో నిలిచిన నీటి సర ఫరా' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ స్పందించారు. మరమ్మతులకు గురైన మోటారుకు రిపే ర్లు చేయించి సాయంత్రం కుళాయిలకు నీటిని సరఫ రా చేయటంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకొన్నారు.

నూతన విగ్రహాలకు గ్రామోత్సవం



నూతన విగ్రహాలు

పాములపాడు: మార్చి 3వ తేదీన ప్రతిష్ఠించనున్న నూతన అమ్మ వారి విగ్రహాలకు సోమవారం మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని పొలిమేర చౌడ మ్మ విగ్రహం దెబ్బతినడంతో నూతన విగ్ర హం ఏర్పాటుతో పాటు దేవాలయం పునర్నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో చౌడేశ్వరి దేవి, వినాయకుడు, పోతురాజు, జంట నాగుల ప్రతిమ, సింహ వాహనం విగ్రహాను గ్రామానికి తీసుకువచ్చిన సందర్భంగా గ్రామస్తులు పెద్ద ఎత్తున మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

జూపాడుబంగ్లా: సచివాలయ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరవ్వడంతోపాటు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ గోపికృష్ణ సూచించారు. సోమవారం మండ్లెం-2 సచివాలయాన్ని తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ సకాలంలో విధులకు హాజరవ్వటంతో పాటు రిజిష్టర్‌లో సంతకం చేసి ఆన్‌లైన్ ఫేషియల్ యాప్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలన్నారు. విధులకు హాజరై ఆన్‌డ్యూటీపై ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా మూమెంటు రిజిష్టర్‌లో నమోదు చేసి వెళ్లాలన్నారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు.

'లక్ష డప్పులు, వేల గొంతులు' జయప్రదం చేయండి

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు రాఘవేంద్ర పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో లక్ష డప్పులు, వేల గొంతులు పోస్టర్లను ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. కార్యక్రమానికి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో మంగళవారం ఉదయం 11 గంటలకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమావేశం నిర్వహిస్తారని పార్టీ మండల, పట్టణాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ సోమవారం తెలిపారు. సమావేశంలో ఈనెల 5వ తేదీన నంద్యాల కలెక్టర్ ఆఫీసులో జరగబోయే వైఎస్సార్‌సీపీ ఫీజుపోరు కార్యక్రమం గురించి చర్చించడం జరుగుతుందన్నారు. శిల్పా అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.